ఆంధ్రప్రదేశ్‌లో హైటెన్షన్

- ఓట్ల లెక్కింపు కోసం భారీ భద్రత
- రాష్ట్రమంతా పోలీసుల చేతుల్లోకి..
- 50 సీఆర్పీఎఫ్ బృందాలతో పాటు ఇతర రాష్ట్రాల పోలీసులూ..
- డీజీపీ హరీశ్‌కుమార్‌గుప్తా, సీఆర్పీఎఫ్ చీఫ్ చారుసిన్హా పర్యవేక్షణ
- పార్టీ కార్యాలయాల వద్ద గట్టి నిఘా
- మరో 15 రోజుల దాకా బందోబస్తు

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : ఆంధ్రప్రదేశ్‌లో ఓట్ల లెక్కింపుపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల సందర్భంగా తలెత్తిన ఉద్రిక్త పరిస్థితుల కారణంగా నేటి ఓట్ల లెక్కింపు కోసం ఎన్నికల సంఘం భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది. ఏపీలోని 175 అసెంబ్లీ, 25లోక్‌సభ స్థానాలకు మే13న ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. సమస్యాత్మక ప్రాంతాల్లో బందోబస్తు కోసం ప్రత్యేకంగా కేంద్రం నుంచి 50 సీఆర్పీఎఫ్ బృందాలను రంగంలోకి దింపింది. ఏపీ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, సీఆర్పీఎఫ్ చీఫ్ చారుసిన్హా భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. పోలింగ్ రోజు పల్నాడు జిల్లా మాచర్ల, అనంతపురం జిల్లా తాడిపత్రి, తిరుపతి జిల్లా చంద్రగిరిలో అలజడి చెలరేగింది. తర్వాతకూడా పల్నాడు జిల్లాలో పెద్ద ఎత్తున హింసాత్మక ఘటనలు జరిగాయి. టీడీపీ, వైసీపీ కార్యకర్తలు ఒకరిపై మరొకరు దాడులకు తెగబడ్డారు. ఓట్ల లెక్కింపు తర్వాత కూడా ఏపీ వ్యాప్తంగా హింస చెలరేగే అవకాశాలున్నాయని ఇంటెలిజెన్స్ వర్గాలు భావిస్తున్నాయి. అల్లర్లు చోటు చేసుకోకుండా పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేశ్‌కుమార్ మీనా ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద అవాంతరాలు కలిగించేందుకు యత్నించే వారిని నిర్దాక్షిణ్యంగా బయటకు పంపాలని చెప్పారు. ఈ మేరకు ఏపీలోని అన్ని నియోజకవర్గాల్లో పోలీసులు భారీగా మోహరించారు. కేంద్ర సాయుధ బలగాలు, ఇతర రాష్ట్రాల పోలీసులను రప్పించారు. ఎస్పీ మల్లికాగార్గ్ పల్నాడు జిల్లాలో అత్యంత్య పకడ్బందీ చర్యలు చేపట్టారు. పల్నాడు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు నర్సరావుపేట పార్లమెంట్ కౌంటింగ్ జేఎన్టీయూ కాలేజ్‌లో జరగనుంది. ఈ కేంద్రం పరిసర ప్రాంతాల్లో ఆంక్షలు విధించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టింగ్స్ పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీజీపీ హెచ్చరించారు. కౌంటింగ్ సెంటర్ల వద్ద 144 సెక్షన్‌తో పాటు పోలీస్ 30 యాక్ట్ కూడా అమలు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రౌడీ షీటర్లపై నగర బహిష్కరణ విధించారు. సీఎం వైఎస్ జగన్, ప్రతిపక్షనేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ నివాసాలు, వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీల కార్యాలయాల వద్ద భద్రత పెంచారు. ఓట్ల లెక్కింపు రోజే కాకుండా మరో పదిహేను రోజుల పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పోలీసుల నిఘాలోనే ఉండనుంది.

తొలి ఫలితం ఇక్కడే..

ఉదయం 8గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. మధ్యాహ్నానికి ఏపీలో అధికారం ఎవరిదనేదానిపై ఓ స్పష్టత రానుంది. అసెంబ్లీ నియోజకవర్గాల విషయానికి వస్తే కొవ్వూరు, నరసాపురం స్థానాలకు తొలుత ఫలితాలు వచ్చే అవకాశముంది. ఈ రెండుచోట్లా 13రౌండ్లలో కౌంటింగ్ పూర్తికానుంది. లెక్కింపు ప్రారంభమైన ఐదుగంటల్లోనే ఫలితాలు వెల్లడికానున్నాయి.

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకి బోకే ఇచ్చి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు యావన్నగారి సంతోష్‌రెడ్డి

ఇల్లెందుల ఏసు(ఫైల్)

మందుపాతర పేలి వ్యక్తి మృతి

- పోలీసుల కోసం అమర్చిన మావోయిస్టులు
- వంటచెరుకు కోసం గుట్టపైకి వెళ్లిన ఐదుగురు
- బాంబుపై కాలు వేయడంతో ఏసు మృత్యువాత
- ములుగు జిల్లా జగన్నాథపురంలో విషాదఛాయలు

వాజేడు, జూన్ 3: వంట చెరుకు కోసం కొంగాల అడవికి వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు మందుపాతరపై కాలు పెట్టడంతో పేలి మృతి చెందాడు. ములుగు జిల్లా వాజేడు మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన ఇల్లెందుల ఏసు(55) ఇల్లెందుల ఏసు, రమేశ్, ఫకీర్, పాల్గుణ, అరికిల్ల లక్ష్మయ్య సోమవారం తెల్లవారుజామున వంట చెరుకుకోసం కొంగాల గుట్టపైకి వెళ్లారు. ఈ క్రమంలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర (ప్రెషర్‌బాంబు)పై ఇల్లందుల ఏసు కాలు వేశాడు. అది ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పేలడంతో ఏసు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనతో పాటు ఉన్న వారిలో ఇద్దరు స్వల్పంగా గాయపడగా, మరో ఇద్దరు సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు. వెంటనే గ్రామంలోకి వెళ్లి విషయం చెప్పి పోలీసులకు సమాచారం అందించారు. ఏసు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఏటూరునాగారం వైద్యశాలకు తరలించి అనంతరం జగన్నాథపురం తీసుకొచ్చారు. దీంతో జగన్నాథపురం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎస్పీ శబరీష్ ఏటూరునాగారం సామాజిక వైద్యశాలలో ఏసు కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం తరపున బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

బెట్టింగ్‌బాబుల యూటర్న్!

- ఎగ్జిట్‌పోల్స్‌తో అంతా తారుమారు
- అనుకున్నదొక్కటి.. అయ్యిందొక్కటి!
- అయోమయంలో పందెంరాయుళ్లు
- విభిన్న అంచనాలతో బెంబేలు
- ఏపీపై తెలంగాణలోనూ జోరు
- వికృతక్రీడలో నేటి సాయంత్రానికి చేతులుమారనున్న రూ.కోట్లు

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : మొన్నటిదాకా తమ అంచనాలే నిజమవుతాయని బలంగా నమ్మిన బెట్టింగ్‌బాబులను ఎగ్జిట్‌పోల్స్ అయోమయంలో పడేశాయి. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీపై కొందరు.. కాంగ్రెస్‌పై కొందరు.. ఏపీలో వైసీపీ గెలుస్తుందని కొందరు.. కూటమి వస్తుందని కొందరు బెట్టింగ్ కాచేలోపే వారి ఆలోచనలను ఎగ్జిట్‌పోల్స్ తారుమారు చేశాయి. ముఖ్యంగా 400కు పైగా సీట్లు వస్తాయని ఆశించిన బీజేపీకి, 250 సీట్లు కూడా దాటే పరిస్థితి లేదని తేలడంతో ఈ పార్టీపై పందెంకాయాలనుకున్నవాళ్లు పునరాలోచనలో పడ్డారు. ఇక కాంగ్రెస్‌కు 200 సీట్లు కూడా వచ్చే పరిస్థితి లేదని సర్వే సంస్థలు ఝుల్ ఇవ్వడంతో ఆ పార్టీ అభిమానులు బెట్టుకట్టాలంటనే భయపడుతున్నారు.

అంతాతూచ్.. మళ్లీ పందెం!

ఆంధ్రప్రదేశ్‌లోనూ విభిన్న అంచనాలు ఎదురవడం పందెంరాయుళ్లకు మింగుడుపడటం లేదు. ఏపీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై భారీగా ఆశలు పెట్టుకున్న బెట్టింగ్‌బాబులు, ఎగ్జిట్‌పోల్స్ చూసి నోరెళ్లబెడుతున్నారు. కొన్ని సంస్థలు కూటమికి పట్టంగట్టడం, మరికొన్ని వైసీపీ వైపు మొగ్గడంతో ఎటువైపు బెట్టుకట్టాలో తెలియని అయోమయంలో పడ్డారు. ఇప్పటికే తమ పార్టీ గెలుస్తుందని బెట్టింగ్‌కట్టిన వాళ్లంతా ఎగ్జిట్‌పోల్స్ చూశాక తెల్లమొహం వేస్తున్నారు. ఒకానొక దశలో 'అంతాతూచ్.. మళ్లీ మొదట్నుంచి పందెం వేద్దాం' అని బతిమాలుకుంటున్నారని సమాచారం. నియోజకవర్గాలవారీగా ఫలానా పార్టీ వ్యక్తి ఎమ్మెల్యేగా గెలుస్తాడని బలంగా అనుకుంటున్నవారు మొదటకాసిన పందేనికే కట్టుబడి ఉంటున్నారని తెలిసింది. గత ఎన్నికల్లో బెట్టింగ్‌తో నష్టపోయినవాళ్లు ఈ సారి ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆచితూచి పందేనికి దిగారని సమాచారం. గత ఎన్నికల్లో డబ్బు పోగొట్టుకున్నవాళ్లంతా ఈసారి ఎగ్జిట్‌పోల్స్ తర్వాత భారీగానే బెట్టింగ్‌కాశారని వినికిడి. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంలో ఏపీలో భారీగా బెట్టింగ్‌లు పెట్టినట్టే, ఏపీలో అసెంబ్లీ ఫలితాలపై తెలంగాణలోనూ భారీగా పందెంకాశారు. ఎక్కువమంది జగనే మళ్లీ అధికారం చేపడుతారనే నమ్మకంతో బెట్టుకట్టినట్లు విశ్వసనీయ సమాచారం. మొత్తంగా అటు లోక్‌సభ ఎన్నికలు, ఇటు తెలంగాణ పార్లమెంట్, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, ఎంపీ ఎన్నికల పేరిట నడిచే బెట్టింగ్ అనే వికృతక్రీడలో నేటి సాయంత్రంలోగా కోట్లాది రూపాయల చేతులుమారనున్నట్లు పోలీసువర్గాలు వెల్లడిస్తున్నాయి. బెట్టింగ్‌పేరిట ఎంతోమంది ఆర్థికంగా నష్టపోతున్నారని, అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని, వాటని కట్టలేక అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని, అనవసరంగా బెట్టింగ్‌కు పోయి కుటుంబాలను రోడ్డునపడేసుకోవద్దని పోలీసులు, ప్రముఖులు సూచిస్తున్నారు.

కౌంటింగ్ వేళ వైసీపీకి సుప్రీంలో ఎదురుదెబ్బ

పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు వ్యవహారంలో జోక్యం చేసుకోలేమన్న సుప్రీంకోర్టు

హైదరాబాద్, జూన్ 3 (నమస్తే తెలంగాణ): ఏపీ ఎన్నికల కౌంటింగ్ వేళ వైసీపీకి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు వ్యవహారంలో తాము జోక్యం చేసుకోలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. కేంద్ర ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్లకు సంబంధించి మే 30న కీలకమైన ఉత్తర్వులు జారీ చేసింది. పోస్టల్ బ్యాలెట్ల ఓటరు డిక్లరేషన్‌కు సంబంధించిన 'ఫాం-13ఏ'పై అటెస్టింగ్ అధికారి సంతకం ఉంటే చాలు.. ఆయన పేరు, హోదా, సీలు లేకపోయినా ఓట్లు చెల్లుబాటవుతాయని ఈసీ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్తర్వులను వైసీపీ హైకోర్టులో సవాల్ చేసింది. పోస్టల్ బ్యాలెట్లకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వుల విషయంలో జోక్యం చేసుకోమని హైకోర్టు డివిజన్‌బెంచ్ స్పష్టం చేసింది. దీంతో ఉత్వర్వులపై వైసీపీ సుప్రీంలో సవాల్ చేసింది. సోమవారం విచారణ జరిపిన జస్టిస్‌లు అరవిందకుమార్, సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం ఆ పిటిషన్‌ను తోసిపుచ్చింది.

పండుగలా హరీశ్ పుట్టినరోజు వేడుకలు

సిద్దిపేట అర్బన్/గుమ్మడిదల, జూన్ 3: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పుట్టిన రోజు వేడుకలు సోమవారం పండుగలా జరిగాయి. శుభాకాంక్షలు చెప్పేందుకు వచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో సిద్దిపేట జిల్లా బీఆర్ఎస్ కార్యాలయం కోలాహలంగా మారింది. ముందుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హరీశ్‌కు ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, నందిని సిధారెడ్డి, దేవీప్రసాద్, ఫారుఖ్ హుస్సేన్, విరాహత్ అలీ, వంటేరు ప్రతాప్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సిద్దిపేట మోడల్ బస్టాండ్ వద్ద అన్నదానం చేశారు. సంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ యువనాయకుడు, కొత్తపల్లి గ్రామ యువనేత యావన్నగారి సంతోష్‌రెడ్డి హైదరాబాద్‌లో హరీశ్‌రావును కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తు తరాలకు బాట చూపే నాయకుడు హరీశన్న చూపే మార్గంలోనే పయనిస్తానని సంతోష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయనే తన శ్వాస, స్ఫూర్తిగా జిల్లా ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు.

కోతుల దాడిలో 'ఓరియంట్' ఉద్యోగి మృతి

- న్యాయం చేయాలని కుటుంబ సభ్యుల ఆందోళన
- 10 లక్షల పరిహారానికి అంగీకరించిన యాజమాన్యం

కాసిపేట, జూన్ 3 : కోతుల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఉద్యోగి ఆదివారం మరణించాడు. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ పర్మినెంట్ ఉద్యోగి మేకల రాకేశ్ (46) వారం క్రితం విధులకు వెళ్లగా కోతులు ఒక్కసారిగా దాడి చేశాయి. దీంతో సైడ్ రెయిలింగ్‌పై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. కంపెనీ యాజమాన్యం వెంటనే స్పందించి ఓరియంట్ హాస్పిటల్‌కు తరలించింది. అక్కడి వైద్యుల సూచన మేరకు మంచిర్యాలలోని దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ఓ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఈ క్రమంలో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉదయం రాకేశ్ మృతదేహంతో కుటుంబ సభ్యులు, కార్మికులు ఓరియంట్ కంపెనీ ఎదుట ఆందోళనకు దిగారు. పలువురు నాయకులు యాజమాన్యంతో చర్చలు జరిపారు. రూ.10 లక్షల పరిహారంతోపాటు ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించడంతో ఆందోళన విరమించారు.

వాణిజ్య

వడ్డీరేట్లు ఇప్పట్లో తగ్గవ్!

ఈ ఏడాది ఆఖరుదాకా ఇంతే • పీఎన్‌బీ ఎండీ అతుల్ కుమార్ గోయల్

న్యూఢిల్లీ, జూన్ 3: వడ్డీరేట్లు ఇప్పట్లో తగ్గబోవని ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) మేనేజింగ్ డైరెక్టర్ అతుల్ కుమార్ గోయల్ అన్నారు. ఈ ఏడాది ఆఖరుదాకా ఇంతేనన్న ఆయన.. డిసెంబర్ ద్రవ్యసమీక్షలో కోతలకు వీలుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. బుధవారం (జూన్ 5) రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఈ ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను రెండో ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షను ప్రారంభించనున్నది. శుక్రవారం (జూన్ 7) నిర్ణయాలను ప్రకటించనున్నది. ఈ నేపథ్యంలో పీఎన్‌బీ ఎండీ గోయల్ అంచనా ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. కరోనా సమయంలో దిగాలు పడిన దేశ ఆర్థిక వ్యవస్థను ఉత్సాహపర్చేందుకు.. ఆర్బీఐ పెద్ద ఎత్తున వడ్డీరేట్లను తగ్గించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత పరిస్థితులు చక్కబడటంతో ద్రవ్యోల్బణం అదుపే లక్ష్యంగా వడ్డీరేట్లను భారీగా పెంచుతూ పోయిన సంగతీ విదితమే. దీంతో రెపో రేటు 6.50 శాతానికి చేరింది. ఫలితంగా అన్ని రకాల రుణాలపై వడ్డీరేట్లూ పెరిగాయి.

ఈఎంఐల భారం..

కరోనా సమయంలో వడ్డీరేట్లు తగ్గడంతో అంతా గృహ, వాహన, వ్యక్తిగత రుణాలను తీసుకున్నారు. అయితే ఇప్పుడు ఆ వడ్డీరేట్లు పెరగడంతో ఆయా రుణాల ఈఎంఐ (నెలవారీ వాయిదాలు)లు భారంగా తయారయ్యాయని రుణగ్రహీతలు లబోదిబోమంటున్నారు. ఈసారి తగ్గుతాయంటూ.. ప్రతీసారీ ఎదురుచూస్తూనే ఉన్నారు. అయినప్పటికీ వడ్డీరేట్ల జోలికి వెళ్లకుండానే ఆర్బీఐ తమ ద్రవ్యసమీక్షల్ని ముగించేస్తున్నది. గత 8సార్లూ ఇదే జరిగింది. ఈ నేపథ్యంలో రాబోయే ద్రవ్యసమీక్షపై గట్టిగానే ఆశలు పెట్టుకున్నారంతా. కానీ వస్తున్న అంచనాలు నీరుగార్చేలా ఉంటున్నాయి. 'వడ్డీరేట్లు అనేవి వృద్ధి, ద్రవ్యోల్బణం, వివిధ దేశాల్లో ద్రవ్య విధానాల వంటి రకరకాల అంశాలపై ఆధారపడి ఉంటాయి. అయితే ఇప్పటికే ఆర్బీఐ.. కీలక వడ్డీరేట్లను గరిష్ఠ స్థాయికి చేర్చింది. బహుశా ఈ ఏడాది ఆఖర్లో తగ్గింపులకు అవకాశాలున్నాయని చెప్పుకోవచ్చు' అని గోయల్ అన్నారు.

డిపాజిట్లపై వడ్డీలు పెరగవు

డిపాజిట్లపై వడ్డీరేట్లు ఇక పెద్దగా పెరగబోవని, 95 శాతం డిపాజిట్ల వడ్డీరేట్లను ఇప్పటికే సవరించడం జరిగిందని గోయల్ తెలిపారు.

దీంతో మరో 4-5 నెలలు వడ్డీరేట్లపై స్థబ్ధత ఉంటుందన్న సంకేతాలనిచ్చారు. కాగా, రిటైల్, వ్యవసాయ రంగాలతో పాటు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) సంస్థలకు రుణాలివ్వడంపై పీఎన్‌బీ దృష్టిపెట్టినట్టు గోయల్ చెప్పారు. అయినప్పటికీ రుణ చరిత్ర బాగున్న కార్పొరేట్ సంస్థలకూ లోన్లిస్తామన్నారు. మౌలిక రంగ ప్రాజెక్టుల నుంచి, ముఖ్యంగా రహదారుల ప్రాజెక్టుల నుంచి రుణాలకు డిమాండ్ ఉందని చెప్పారు.

సాథీ 2.0 మొబైల్ యాప్

- ఇన్వెస్టర్ల కోసం తెచ్చిన సెబీ

న్యూఢిల్లీ, జూన్ 3: క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ.. సోమవారం 'సాథీ 2.0' మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. పర్సనల్ ఫైనాన్స్‌లోని సంక్లిష్ట ఆర్థికాంశాలను సరళతరం చేయడమే లక్ష్యంగా సమగ్ర సాధనాలతో మదుపరుల కోసం ఈ నయా మొబైల్ అప్లికేషన్‌ను సెబీ తీసుకొచ్చింది. 'ఆధునికీకరించిన 'సాథీ' యాప్ ఎంతో యూజర్ ఫ్రెండ్లీ'గా ఉంటుందని ఓ ప్రకటనలో సెబీ పేర్కొన్నది. ఇందులో ఫైనాన్షియల్ క్యాలిక్యులేటర్స్, మాడ్యుల్స్ ఉంటాయని, స్టాక్ ఎక్స్ఛేంజీల్లో షేర్ల క్రయవిక్రయాలు, మ్యూచువల్ ఫండ్స్, ఈటీఎఫ్ లావాదేవీలతోపాటు కేవైసీ నిబంధనల వివరణ వంటివన్నింటినీ పూర్తిస్థాయిలో తెలుసుకోవచ్చని సెబీ ఈ సందర్భంగా చెప్పింది. అంతేగాక మదుపరుల సమస్యలకు పరిష్కార వ్యవస్థ, ఆన్‌లైన్ డిస్పూట్ రిజల్యూషన్ (ఓడీఆర్) వేదిక కూడా ఉందన్నది. ఇన్వెస్టర్ల పర్సనల్ ఫైనాన్స్ ప్లానింగ్ కోసం అవగాహనను పెంచే వీడియోలు కూడా ఉంటాయి. కాగా, ఈ యాప్‌ను ఆండ్రాయిడ్ మొబైల్ యూజర్లు గూగుల్ ప్లే స్టోర్ నుంచి, యాపిల్ మొబైల్ వినియోగదారులు ఐవోఎస్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

కియా కారెన్స్ @ 1.5 లక్షలు

న్యూఢిల్లీ, జూన్ 3: దేశీయ వాహన మార్కెట్‌లో కియా కారెన్స్ జోరు మీదున్నది. 27 నెలల్లో 1.5 లక్షల యూనిట్ల అమ్మకాలను దాటింది. టయోటా ఇన్నోవా క్రిస్టా, మారుతీ సుజుకీ ఎర్టిగా తదితర మాడళ్ల నుంచి గట్టి పోటీ ఉన్నప్పటికీ.. వాహనదారులను ఆకట్టుకుంటూ అమ్మకాల్లో దూసుకుపోతున్నది. 2022 ఫిబ్రవరిలో మార్కెట్‌కు పరిచయమైన కియా కారెన్స్‌లో సన్‌రూఫ్, మల్టీ డ్రైవ్ మోడ్స్, వెంటిలేటెడ్ సీట్స్, కనెక్టెడ్ కార్ టెక్నాలజీ ఉన్నాయి. ఇక ఈ కారు ధరల శ్రేణి రూ.12.88-23.94 లక్షల మధ్య ఉన్నది.

టైగున్, వర్చుస్ మాడళ్లలో 6 ఎయిర్ బ్యాగులు

ముంబై, జూన్ 3: జర్మనీ ఆటో రంగ దిగ్గజం ఫోక్స్‌వాగన్.. భారత్‌లో అమ్ముతున్న 5-స్టార్ గ్లోబల్ ఎన్‌సీఏపీ సేఫ్టీ రేటింగ్ ఉన్న టైగున్, వర్చుస్ అన్ని వేరియంట్ల కార్లలో 6 ఎయిర్ బ్యాగులను ఆఫర్ చేస్తున్నది. ఈ మేరకు సోమవారం ఆ సంస్థ తెలిపింది. 2021 సెప్టెంబర్‌లో టైగున్, 2022 మార్చిలో వర్చుస్ మాడళ్లను దేశీయ మార్కెట్‌కు ఫోక్స్‌వాగన్ పరిచయం చేసింది. ఇటీవలే టైగున్ జీటీ లైన్, జీటీ ప్లస్ స్పోర్ట్ వేరియంట్లను తీసుకొచ్చింది. వీటిలో 1, 1.5 లీటర్ టర్బో-పెట్రోల్ ఇంజిన్లుంటాయి. కార్ల ధరల శ్రేణి రూ.11.5 లక్షల నుంచి రూ.25 లక్షల మధ్య ఉన్నది.

పరేఖ్ జీతం రూ.66.24 కోట్లు

న్యూఢిల్లీ, జూన్ 3: ఇన్ఫోసిస్ సీఈవో సలీల్ పరేఖ్ వార్షిక వేతనం గత ఆర్థిక సంవత్సరం (2023-24) 17 శాతం పెరిగి రూ.66.24 కోట్లకు చేరింది. దీంతో ఐటీ పరిశ్రమలో అత్యధిక జీతం పొందుతున్న సాఫ్ట్‌వేర్ కంపెనీల సీఈవోల్లో పరేఖ్ కూడా చేరిపోయారు. 2022-23లో పరేఖ్ జీతం రూ.56.4 కోట్లుగా ఉన్నది. ఇన్ఫోసిస్ తాజా వార్షిక నివేదిక ప్రకారం పరేఖ్ బేస్ సాలరీ రూ.7 కోట్లు. మిగతాదానిలో స్టాక్స్, వేరియబుల్ పేమెంట్స్ ఇతరత్రా ఉన్నాయి. ఇక టీసీఎస్ సీఈవో వేతనం రూ.25 కోట్లకుపైగా ఉన్నది.

ప్రపంచ సీఈవోల్లో..

ఎస్అండ్‌పీ 500 కంపెనీల సీఈవోల వేతనాలు గత ఏడాది దాదాపు 13 శాతం పెరిగాయి. దీంతో సాధారణ ఉద్యోగులకు, చీఫ్ ఎగ్జిక్యూటివ్‌ల జీతాలకు మధ్య వ్యత్యాసం ఇంకా పెరిగిపోయినట్టైంది. బ్రాడ్‌కామ్ సీఈవో హాక్ టాన్ వేతనం దాదాపు 162 మిలియన్ డాలర్లుగా ఉన్నది. ఇదే అత్యధికమని ఓ తాజా సర్వేలో తేలింది. ఇదిలావుంటే 2023లో అత్యధిక జీతాలు తీసుకున్న సీఈవోల్లో మహిళల సంఖ్య పెరిగింది. అడ్వాన్స్‌డ్ మైక్రో డివైజెస్ సీఈవో లిసా సు అగ్రస్థానంలో ఉన్నట్టు ఏపీ తెలియజేసింది.

బెటర్ న్యూట్రిషన్‌లో సింధు పెట్టుబడులు

న్యూఢిల్లీ, జూన్ 3: భారత స్టార్ షట్లర్, తెలుగు క్రీడాకారిణి పీవీ సింధు.. గ్రీన్‌డేకు చెందిన 'బెటర్ న్యూట్రిషన్' బ్రాండ్‌లో పెట్టుబడులు పెట్టారు. ఈ బ్రాండ్ అంబాసిడర్‌గా కూడా ఉన్నట్టు సోమవారం ఆమె ప్రకటించారు. బయోఫోర్టిఫైడ్ ఫుడ్స్ ద్వారా దేశంలో సూక్ష్మ పోషకాల కొరతను అధిగమించడమే లక్ష్యంగా ఈ బ్రాండ్ మార్కెట్‌లోకి వచ్చింది. కాగా, దేశంలో పోషకాహార లోపం ప్రధాన సమస్యగా తయారైందని, ఈ ఉత్పత్తులతో దాన్ని అధిగమించవచ్చని సింధు ఈ సందర్భంగా తెలిపారు.

ఇంకా రాని రూ.2వేల నోట్లు రూ.7,755 కోట్లు

ముంబై, జూన్ 3: చలామణి నుంచి ఇంకా వెనక్కిరాని రూ.2,000 నోట్లు 2.18 శాతం ఉన్నాయని, వాటి విలువ రూ.7,755 కోట్లుగా ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) సోమవారం ప్రకటించింది. ఇప్పటిదాకా 97.82 శాతం రూ.2వేల నోట్లు బ్యాంకింగ్ వ్యవస్థలోకి తిరిగొచ్చాయని చెప్పింది. 2023 మే 19న చలామణి నుంచి రూ.2,000 నోట్లను ఉపసంహరించుకుంటున్నట్టు ఆర్బీఐ ప్రకటించిన విషయం తెలిసిందే. నాడు చలామణిలో ఉన్న ఈ నోట్ల విలువ రూ.3.56 లక్షల కోట్లు. ఇదిలావుంటే నిరుడు అక్టోబర్ 7దాకా దేశంలోని అన్ని బ్యాంక్ శాఖల్లో రూ.2,000 నోట్ల మార్పిడి జరిగింది. ఆ తర్వాత నుంచి హైదరాబాద్‌తోపాటు దేశవ్యాప్తంగా ఉన్న 19 ఆర్బీఐ కార్యాలయాల్లో మాత్రమే ఈ మార్పిడికి వీలుంటున్నది.



మార్కెట్ కిర్రాక్ షో

ఆద్యంతం ఎగ్జిట్ పోల్స్ జోష్ • ఆల్‌టైమ్ హై గరిష్ఠాలకు సూచీలు

రికార్డు స్థాయిలో సెన్సెక్స్ 2,507, నిఫ్టీ 733 పాయింట్లు అప్

ముంబై, జూన్ 3: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ లాభాల్లో పరుగులు పెట్టాయి. ఉదయం ప్రారంభమైన దగ్గర్నుంచి మధ్యాహ్నం ముగిసేదాకా సూచీలు ఫుల్ జోష్‌ను కనబర్చాయి. శనివారం చివరి విడుత పోలింగ్ ముగిశాక విడుదలైన ఎగ్జిట్ పోల్స్ అంచనాలు.. మదుపరుల్లో కొత్త ఊపును తీసుకొచ్చాయని మార్కెట్ నిపుణులు తాజా ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. కేంద్రంలో మరోసారి మోదీ సర్కారే వస్తుందన్నట్టుగా సీట్ల లెక్కలున్నాయి. ఈ క్రమంలోనే అటు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్, ఇటు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ.. ఆల్‌టైమ్ హై రికార్డులకు చేరాయి. సెన్సెక్స్ 2,507.47 పాయింట్లు లేదా 3.39 శాతం ఎగిసి మునుపెన్నడూ లేనివిధంగా 76,468.78 వద్ద నిలిచింది. ఇంట్రా-డేలో తొలిసారి 76,738.89 స్థాయిని తాకింది. నిఫ్టీ 733.20 పాయింట్లు లేదా 3.25 శాతం ఎగబాకి గతంలో ఎప్పుడూ లేనివిధంగా 23,263.90 వద్ద స